సాక్షి
చిత్తూరు
బుధవారం, 22, నవంబర్, 2023



'గూడు' కుదిరె!

ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాలు– పేదలందరికీ ఇళ్లు పథకంపై ప్రజల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. - 8లో



ఓటరు క్లెయిమ్స్ పరిష్కారం

ఓటరు జాబితాకు సంబంధించి క్లెయిమ్స్‌ను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్, జేసీ ఆదేశించారు. - 8లో



ఓర్వలేకే అసత్య ప్రచారం

కాణిపాకం ఆలయంలో చేపట్టిన అభివృద్ధిని ఓర్వలేకే అసత్య ప్రచారం చేస్తున్నారని ఆలయ చైర్మన్, ఈఓ మండిపడ్డారు. - 8లో

న్యూస్‌రీల్

24న షూటింగ్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక

రామకుప్పం : స్థానిక బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఈ నెల 24వ తేదీ ఉదయం 9 గంటలకు ఉమ్మడి చిత్తూరు జిల్లా అండర్–19 షూటింగ్ బాల్ బాల బాలికల జట్లు ఎంపిక చేయనున్నట్లు స్కూల్ గేమ్స్ కార్యదర్శి జయరామయ్య తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ 1–1–2005 తేదీ తర్వాత జన్మించిన వారు ఎంపికలకు అర్హులన్నారు. క్రీడాకారులు ఇంటర్ చదువుతూ, స్కూల్ మానిటరింగ్ యాప్‌లో పేరు నమోదు చేసుకుని ఉండాలని సూచించారు. వివరాలకు 8639279444 నంబర్‌లో వెంకటరమణారెడ్డిని సంప్రదించాలని కోరారు.

జాతీయస్థాయి పోటీలకు గురుకుల విద్యార్థి


పవన్‌కుమార్

నడుం: జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు గురుకుల పాఠశాల విద్యార్థి ఎంపికైనట్లు ప్రిన్సిపల్ శ్రీనివాసులరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ జిల్లాలో ఇటీవల నిర్వహించిన అండర్–14 అంతర్రాష్ట్ర కబడ్డీ పోటీల్లో తమ పాఠశాల 9వ తరగతి విద్యార్థి పవన్‌కుమార్ ఉత్తమ ప్రతిభ కనబరచి జాతీయస్థాయికి ఎంపికైనట్లు వెల్లడించారు.

తొలిరోజు 44 రిజిస్ట్రేషన్లు

చిత్తూరు కార్పొరేషన్: రిజిస్ట్రేషన్‌శాఖలో మంగళవారం నుంచి అమల్లోకి వచ్చిన కార్డ్ ప్రైమ్ 2.0 ద్వారా మొత్తం 44 రిజిస్ట్రేషన్లు జరిగినట్లు జిల్లా రిజిస్ట్రార్ శ్రీనివాసరావు తెలిపారు. సాఫ్ట్‌వేర్‌లో తలెత్తిన సాంకేతిక సమస్యలను నిపుణుల సలహాలతో పరిష్కరించుకుంటూ వెళుతున్నామన్నారు. కొత్త విధానంతో వినియోగదారులకు ఎటువంటి ఇబ్బంది ఉండదని స్పష్టం చేశారు.

సిలబస్ పూర్తి చేయకుంటే చర్యలు


మాట్లాడుతున్న డీఈఓ విజయేంద్రరావు

చిత్తూరు కలెక్టరేట్ : సర్కారు బడుల్లో ఉపాధ్యాయులు నిర్ణీత గడువులో సిలబస్ పూర్తి చేయకపోతే చర్యలు తప్పవని డీఈఓ విజయేంద్రరావు హెచ్చరించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 25 నుంచి డిసెంబర్ 8వ తేదీ వరకు సమ్మెటివ్–1 పరీక్షలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఉమ్మడి పరీక్షల విభాగం సెక్రటరీ హేమారెడ్డిని ఆదేశించారు. పదోతరగతి విద్యార్థులపై ఆయా సబ్జెక్టు టీచర్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. పాఠశాలల్లో జగనన్న గోరుముద్ద కింద మెనూ ప్రకారం పిల్లలకు భోజనం వడ్డించాలని స్పష్టం చేశారు.

పకడ్బందీగా రేషన్ పంపిణీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో పకడ్బందీగా రేషన్ సరుకులు పంపిణీ చేయాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు ఆదేశించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మొత్తం 5,41,678 మంది రేషన్‌కార్డుదారులకు డిసెంబర్‌కు గాను బియ్యం, రాగులు, గోధుమ పిండి, చక్కెర, కందిపప్పు పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. ఎండీయూ ఆపరేటర్లు కార్డుదారుల అడిగిన మేరకు బియ్యం, రాగులు అందించాలని సూచించారు.

రేపటికి వేలం వాయిదా

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో బుధవారం నిర్వహించాల్సిన బహిరంగ వేలంపాటను గురువారానికి వాయిదా వేసినట్లు ఆలయ ఈఓ వెంకటేశు తెలిపారు. ఈ విషయాన్ని టెండరుదార్లు గమనించాలని కోరారు.

టీబీపై టీకాస్త్రం





క్షయ.. చాపకింద నీరులా విస్తరిస్తుంది. తుమ్మినా.. దగ్గినా.. నోటి తుంపర్ల ద్వారా వ్యాప్తి చెందుతుంది. ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా ప్రాణం మీదకు తెస్తుంది. ఈ క్రమంలో టీబీ కట్టడికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందులో భాగంగా బాధితులను గుర్తించేందుకు క్షేత్రస్థాయిలో సర్వే చేపడుతోంది. చిన్నపాటి లక్షణాలు కనిపించినా ఆస్పత్రుల్లో ఉచితంగా పరీక్షలు చేయిస్తోంది. వ్యాధి నిర్ధారణ అయితే వెంటనే సకాలంలో వైద్యసేవలందిస్తోంది. రోగులు త్వరితగతిన కోలుకునేందుకు పౌష్టికాహారం పంపిణీ చేస్తోంది. ఎప్పటికప్పుడు నిత్యావసర సరుకులతోపాటు ఆర్థికసాయం అందిస్తోంది. జిల్లాను క్షయ రహితంగా తీర్చిదిద్దేందుకు త్వరలోనే వ్యాక్సినేషన్‌కు సైతం శ్రీకారం చుట్టనుంది.


టీబీ బాధితులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న అధికారులు (ఫైల్)

ఉమ్మడి జిల్లా సమాచారం

మొత్తం టీబీ యూనిట్లు	21
ఈ ఏడాది నమోదైన క్షయ రోగులు	3,547 మంది
డీఆర్‌టీబీ కేసులు	41
డీఎస్‌టీబీ కేసులు	3,506

- క్షయ కట్టడికి క్షేత్రస్థాయిలో చర్యలు
- బాధితుల గుర్తింపునకు పకడ్బందీ సర్వే
- లక్షణాలు కనిపిస్తే ఆస్పత్రిలో పరీక్షలు
- నిర్ధారణ అయితే వెంటనే వైద్యసేవలు
- త్వరలోనే జిల్లావ్యాప్తంగా వ్యాక్సినేషన్

వ్యాధి వ్యాప్తి ఇలా..

- టీబీ బాధితుడితో సుదీర్ఘ సమయం గడపడం
- రద్దీ వాతావరణంలో ఉండడం
- హెచ్‌ఐవీ సోకిన వ్యక్తికి
- మధుమేహ రోగులకు
- రోగ నిరోధక శక్తిని తగ్గించే మందులు వాడే వారికి
- ఊపిరితిత్తుల వ్యాధులు ఉన్న వారికి

లక్షణాలు..

- ✔ రెండు వారాలకు మించి దగ్గు
- ✔ ఔషధాలు వాడినా పక్షం రోజులపాటు తగ్గని జ్వరం
- ✔ కళ్లల్లో రక్తం పడటం,
- ✔ శరీర బరువు కోల్పోవడం
- ✔ ఛాతీ ఎక్స్‌రేలో మార్పు
- ✔ దగ్గినప్పుడు ఉమ్మిలో రక్తం కనిపించడం

వ్యాక్సినేషన్ ఇలా..

- ✔ టీబీ వచ్చి తగ్గిన వారికి
- ✔ 60 ఏళ్లు పైబడిన వృద్ధులకు
- ✔ మధుమేహం బాధితులకు
- ✔ ధూమపానం చేసేవాళ్లకు
- ✔ తక్కువ బరువు ఉన్న వారికి
- ✔ క్షయ రోగుల కుటుంబీకులకు

చిత్తూరు రూరల్ : ఉమ్మడి జిల్లాలోని తిరుపతి అర్బన్, చిత్తూరు, కుప్పం, నగరి, పలమనేరు, శ్రీకాళహస్తి, మదనపల్లె యూనిట్ల పరిధిలో టీబీ బాధితులు అధిక సంఖ్యలో ఉన్నట్లు క్షయ నివారణ అధికారులు గుర్తించారు. వీరికి ఆరు నెలల పాటు డాట్ పద్ధతి ద్వారా ఆశ కార్యకర్తల సాయంతో క్రమం తప్పకుండా ఉచితంగా మందులు అందిస్తున్నారు. ప్రతి నెలా వారి ఖాతాలో రూ.500 జమ చేస్తున్నారు. నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్నారు. రోగులను పూర్తిస్థాయి ఆరోగ్యవంతులుగా తయారయ్యే వరకు అండగా నిలుస్తున్నారు. అయితే క్షయ వ్యాధిని ప్రాథమిక స్థాయిలో గుర్తించి క్రమం తప్పకుండా చికిత్స అందిస్తేనే కోలుకునే అవకాశముంటుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. మందులు వాడడంలో నిర్లక్ష్యం వహిస్తే ప్రమాదకరంగా పరిణమిస్తుందని స్పష్టం చేస్తున్నారు. టీబీ బాధితులతో కరచాలనం చేసినా, పబ్లిక్ టాయిలెట్లు ఉపయోగించినా, ఆహారం పంచుకున్నా ఇబ్బంది ఉండదని తెలియజేస్తున్నారు. దగ్గు, తుమ్ముల విషయంలో తగు జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్నారు. ఈ క్రమంలోనే డిసెంబర్ 15వ తేదీ తర్వాత జిల్లాలో టీబీకి వ్యాక్సినేషన్ చేపట్టనున్నారు. ఇది వరకు శిశువులకు మాత్రమే వేసే బీసీజీ టీకాను ఇకపై పెద్దలకు కూడా వేయించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

క్షయ రహితమే లక్ష్యం



జిల్లాను క్షయ రహితంగా తయారు చేయడమే లక్ష్యం. టీబీ రోగులకు మెరుగైన వైద్యం అందిస్తున్నాం. అదే సమయంలో నివారణకు పకడ్బందీగా చర్యలు చేపడుతున్నాం. డిసెంబర్ 15వ తేదీ తర్వాత జిల్లాకు టీకాలు రానున్నాయి. ఈ క్రమంలో ప్రస్తుతం టీకా అవసరమున్న వారిని గుర్తించే పనిలో ఉన్నాం. వంద శాతం టీబీ కేసులు లేకుండా చేసేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నాం.

– వెంకట ప్రసాద్, జిల్లా క్షయ నివారణ అధికారి, చిత్తూరు

బస్సుల కంపెనీకి భూ కేటాయింపు

- ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్ షణ్మోహన్


పెప్పర్ మోషన్ ఎలక్ట్రికల్ బస్సు(ఫైల్)

పుంగనూరు : ప్రపంచ ప్రసిద్ధి చెందిన జర్మన్ పెప్పర్ మోషన్ ఎలక్ట్రికల్ బస్సులు, ట్రక్కుల కంపెనీని పుంగనూరులో నెలకొల్పేందుకు భూమిని కేటాయిస్తూ కలెక్టర్ షణ్మోహన్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు మండలంలోని ఆరడిగుంట, మేలుందొడ్డి, వనమలదిన్నె ప్రాంతాల్లో 800 ఎకరాలను పరిశ్రమ కోసం సేకరించాలని ఆదేశించారు. పుంగనూరు నియోజకవర్గంలో పారిశ్రామికాభివృద్ధికి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి విశేషంగా కృషి చేస్తున్న విషయం విధితమే. ఈ క్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో ప్రత్యేకంగా చర్చించి బస్సుల కంపెనీ నెలకొల్పేందుకు అనుమతులు సాధించారు. ఇటీవల జరిగిన కేబినెట్ భేటీలో బస్సుల కంపెనీని పుంగనూరులో స్థాపించేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో పనులు మరింత వేగవంతం చేశారు. మంత్రి పెద్దిరెడ్డి ఆధ్వర్యంలో యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టారు. తొలి దశలో భూ కేటాయింపునకు ఉత్తర్వులు జారీ కావడంతో త్వరలోనే పుంగనూరు నియోజకవర్గం దేశస్థాయిలో గుర్తింపు పొందేందుకు మార్గం సుగమమైంది.

10వేల మందికి ఉపాధి

జర్మనీకి చెందిన పెప్పర్ మోషన్ ఎలక్ట్రికల్ బస్సులు, ట్రక్కులు, బ్యాటరీలు తయారు చేసే సంస్థ సుమారు రూ.5 వేల కోట్లతో 800 ఎకరాల్లో ఫ్యాక్టరీ నిర్మించనుంది. దీని ద్వారా 10 వేల మందికి ఉపాధి లభించనుంది. దీనిపై ఈనెల 29వ తేదీన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో కంపెనీ ఫౌండర్లు నిర్మాణ పనులపై చర్చించనున్నారు. త్వరలోనే పుంగనూరులో పర్యటించి కంపెనీ నిర్మాణం ప్రారంభించేందుకు చర్యలు చేపట్టనున్నారు.

టీడీపీ–జనసేన కలిసినా జయం మనదే


మాట్లాడుతున్న డిప్యూటి సీఎం నారాయణస్వామి

పాలసముద్రం: రాబోయే ఎన్నికల్లో టీడీపీ–జనసేన కలిసి వచ్చినా జయం వైఎస్సార్‌సీపీదే అని డిప్యూటీ సీఎం నారాయణస్వామి స్పష్టం చేశారు. మంగళవారం ఆయన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో వివరించాలని కోరారు. పార్టీలతో ప్రమేయం లేకుండా అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి మాత్రమే దక్కుతుందని కొనియాడారు. జగనన్న పాలనలో ఎస్సీ, బీసీ, మైనార్టీలకు సామాజిక, రాజకీయ ప్రాధాన్యత లభిస్తోందని తెలిపారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబు బీసీలకు పనిముట్లు ఇచ్చి వారిని కులవృత్తులకే పరిమితం చేయాలని చూశారని ఆరోపించారు. రాబోయే ఎన్నికల్లో పేదలు.. పెత్తందారులకు మధ్య పోరాటమని, పేదలకు ప్రతినిధిగా జగనన్న నడుస్తున్నారని వెల్లడించారు. త్వరలోనే 3,200 ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టులు భర్తీ చేయనున్నట్లు చెప్పారు. 8,200 పోస్టులకు డీస్సీ నిర్వహించనున్నట్లు తెలిపారు. సంక్షేమ పథకాలు ఇలాగే రావాలంటే మళ్లీ జగనన్ననే ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు అన్బళగన్, పార్టీ మండల కన్వీనర్ తులసీరామ్ యాదవ్, ఎంపీటీసీ సభ్యుడు గోవిందరాజులు, నేతలు అరుల్, గోపాల్, రవిరెడ్డి, పయణి, మనోహర్, వేణు, రాజాయణి, సర్పంచ్ మహేష్, ధనంజయులు పాల్గొన్నారు.

సంక్షేమానికి కేరాఫ్‌గా ఆంధ్ర


సంక్షేమ బోర్డు ఆవిష్కరిస్తున్న మంత్రి రోజా

విజయపురం (నగరి) : సంక్షేమ పథకాలకు కేరాఫ్‌గా ఆంధ్రప్రదేశ్ అవతరించిందని మంత్రి ఆర్కే రోజా తెలిపారు. మంగళవారం విజయపురం మండలం కలియంబాకంలో నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. సచివాలయం వద్ద సంక్షేమ బోర్డు ఆవిష్కరించారు. పార్టీ జెండా ఎగురవేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ దృఢసంకల్పానికి నిలువెత్తు నిదర్శనం జగనన్న అని కొనియాడారు. కలియంబాకం సచివాలయ పరిధిలో రూ. 25.02 కోట్ల అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేసినట్లు వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ లబ్ధి ప్రజలు తెలుసుకోవాలనే డిస్ ప్లే బోర్డులను ఆవిష్కరించినట్లు వెల్లడించారు. జగనన్న పాలనలో బడుగు, బలహీన వర్గాలకు సామాజిక న్యాయం సాధ్యమైందన్నారు. కుల,మత, పార్టీలకు అతీతంగా సంక్షేమాన్ని అందించిన జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలని పిలుపునిచ్చారు. మహిళా సాధికారత జగనన్నతోనే సాధ్యమన్నారు. ఎంపీపీ జమున, వైస్ ఎంపీపీ మంజుబాలాజీ, ఎంపీటీసీ సభ్యుడు రాజగోపాల్‌యాదవ్, సర్పంచ్ భాస్కర్ రెడ్డి, శ్రీరాములురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

30న సంకటహర చతుర్థి వ్రతం


కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయం

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో ఈ నెల 30వ తేదీన సంకటహర చతుర్థి వ్రతం నిర్వహించనున్నారు. వ్రతంలో పాల్గొనేందుకు భక్తులు రూ.350 చెల్లించాల్సి ఉంటుంది. మంగళవారం ఈ మేరకు ఆలయ కమిటీ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశు మాట్లాడుతూ భక్తులు టికెట్ తీసుకుంటే పూజా సామగ్రిని ఆలయ అధికారులు సమకూరుస్తారన్నారు. ఎంతమంది అయినా వ్రతంలో పాల్గొనవచ్చని తెలిపారు. ఈ మేరకు సర్వం సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. అదే రోజు సాయంత్రం స్వామివారి స్వర్ణరథోత్సవం ఉంటుందని తెలిపారు.

మత్స్యకారుల జీవనోపాధికి కృషి


లబ్ధిదారునికి వాహన తాళం అందిస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మేయర్ అముద

చిత్తూరు కలెక్టరేట్ : మత్స్యకారుల జీవనోపాధికి ప్రభుత్వం చర్యలు చేపడుతోందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో ప్రపంచ మత్స్యకారదినోత్సవాన్ని రస్కరించుకుని ప్రధానమంత్రి మత్స్యసంపద యోజన పథకం జిల్లా స్థాయి కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్ విధానంలో తాడేపల్లె నుంచి ప్రారంభించారు. ఈ సందర్భంగా అర్హులైన మత్స్యకారులకు సబ్సిడీతో వాహనాలు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మత్స్యకారులకు అండగా ఉంటున్నారన్నారు. టీడీపీ పాలనలో మత్స్యకారులకు అన్యాయం జరిగిందని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానేమత్స్యకార భరోసా పథకాన్ని అమలు చేసిందని తెలిపారు. మత్స్యకారులకు ఏటా రూ.10వేలు అందిస్తోందని వెల్లడించారు. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన కింద లబ్ధిదారులకు రూ.63 లక్షల విలువైన 3 నాలుగు చక్రాల వాహనాలు, రూ.29.8 లక్షల విలువైన 4 ద్విచక్రవాహనాలు పంపిణీ చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో మేయర్ అముద, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, జిల్లా మత్స్యశాఖ డీడీ రవికుమార్ పాల్గొన్నారు.

అనుభవించు రాజా!

- చిత్తూరులో టీడీపీ నేతల భూ దందా
- విలువైన కాలువపోరంబోకు భూమి ఆక్రమణ
- అడ్డురాకుండా ఉండేందుకు మొక్కలు నాటిన వైనం
- అనుభవం పేరుతో ఎకరం రూ.లక్ష చొప్పున విక్రయం
- బదిలీపై వెళ్లిన వీఆర్‌ఓ కనుసన్నల్లో అక్రమదందా
- ఉన్నతాధికారుల కళ్లుగప్పి తమ్ముళ్ల భూదందాలు


కాలువ పోరంబోకు భూమిని ఆక్రమించుకుని మామిడి మొక్కలు నాటి ఉన్న దృశ్యం

సాక్షి, తిరుపతి: చిత్తూరులో టీడీపీ నేతలు ప్రభుత్వ భూములపై కన్నేశారు. కొందరు అధికారుల అండతో విలువైన భూములను నొక్కేస్తున్నారు. ఆక్రమించుకున్న భూముల్లో మొక్కలు నాటి అనుభవం పేరుతో ఒకరు దర్జాగా జెండా పాతేస్తున్నాడు. ఆపై భూములు తన అనుభవంలో ఉన్నట్లు నకిలీ పత్రాలు సృష్టించి విలువైన భూమిని ఎకరం రూ.లక్ష చొప్పున విక్రయించి సొమ్ముచేసుకుంటున్నారు. మరొకరు తన అనుభవంలో ఉన్న భూమి రహదారి కోసం తీసుకున్నారంటూ ప్రభుత్వం ఇచ్చే పరిహారాన్ని నొక్కేస్తున్నాడు. ఈ అక్రమ భూదందా బదిలీపై వెళ్లిన ఓ వీఆర్‌ఓ కనుసన్నల్లో నడుస్తోంది. చిత్తూరు మండలం, 36 గొల్లపల్లి ప్రాంతంలో రెండేళ్ల క్రితం చిత్తూరు– తచ్చూరు రోడ్డు పురుడు పోసుకుంది. ప్రస్తుతం రోడ్డు పనులు చకచకా సాగుతున్నాయి. రోడ్డుకు ఇరువైపులా పట్టా భూములతో పాటు వందల ఎకరాల మేత బీడు భూమి, కాలువ భూమి, బీడు భూములు ఉన్నాయి. ఇటీవల జరిగిన రీసర్వేలో కూడా ఈ భూములు ప్రభుత్వానికి సంబంధించినవిగా గుర్తించారు. జాతీయ రహదారిని ఆనుకుని ఉండడంతో ఈ భూములు కోట్ల రూపాయల ధర పలుకుతున్నాయి. భవిష్యత్‌లో మరింతగా డిమాండ్ పెరుతుందని భావించిన టీడీపీ నేతలు ఓ వీఆర్వో సహకారంతో ఇద్దరు రెవెన్యూ అధికారులతో కలిసి ఈ భూములపై కన్నేశారు.

టీడీపీ నేతా.. మజాకా?

గొల్లపల్లికి చెందిన ఓ టీడీపీ నాయకుడు తన తెలివితేటలు ఉపయోగించి ప్రభుత్వ భూములను తన అనుభవంలో ఉన్నట్లు పత్రాలు సృష్టించుకున్నాడు. చిత్తూరు– తచ్చూరు రోడ్డు వేయడంతో తన భూమి పోయిందని పరిహారం కోసం దరఖాస్తు చేసుకున్నాడు. అందుకు ఎకరానికి రూ.1.5 లక్షల చొప్పున వీఆర్వో, మరో ఇద్దరు రెవెన్యూ అధికారులకు మామూళ్లు ఇచ్చుకున్నాడు. బదిలీపై వెళ్లిన ఓ వీఆర్‌ఓ సహకారంతో అంతా పక్కాగా స్కెచ్ వేశాడు. రూ.లక్ష చేతిలో పెట్టి రూ.15 లక్షల పరిహారాన్ని కొట్టేసేందుకు మార్గం సుగమం చేసుకున్నాడు. డీల్ ప్రకారం మూడెకరాలకు పరిహారం అందినట్లు సమాచారం. అయితే పరిహారం పంపకాల్లో అధికారులు, టీడీపీ నేత మధ్య వివాదం రేగినట్లు విశ్వసనీయ సమాచారం.

ఆక్రమించి.. ఆపై అనుభవం

మరో టీడీపీ నేత విలువైన ప్రభుత్వ భూములను ఆక్రమించి ఆ వెంటనే మామిడి మొక్కలు నాటేశాడు. ఆ మొక్కలు చూపించి ఆ భూమి తన అనుభవంలో ఉన్నట్టు ఆ వీఆర్వో సహకారంతో రికార్డులు తయారు చేయించుకుంటున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే తమదేనంటూ కొన్ని పత్రాలు చూపించి బెదిరిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. అనుభవ పత్రాలు చూపించి వెంటనే అమ్మి సొమ్ముచేసుకుంటున్నారు. ఆక్రమించుకున్న కాలువ పోరంబోకు భూమి మూడెకరాలు ఇప్పటికే ఇతరులకు విక్రయించారు. మిగిలిన భూమికి అనుభవ పత్రాలు సృష్టించే పనిలో నిమగ్నమైనట్లు విశ్వసనీయ సమాచారం.

పక్క సర్వే నంబర్ వేసి అమ్మేస్తున్నారు

ఆ వీఆర్వో మరి కొన్ని ఎకరాల ప్రభుత్వ భూమిని విక్రయించి సొమ్ముచేసుకునేందుకు మరో పథకం వేశాడు. గుట్టుచప్పుడు కాకుండా పక్కనున్న పట్టా భూమి సర్వే నంబర్‌ను వేసి ప్రభుత్వ భూములను ఇతరులకు కట్టబెట్టేందుకు రంగం సిద్ధం చేసినట్లు సమాచారం.

క్లుప్తంగా

నిబంధనలు మేరకే పరీక్ష ఫీజు


మాట్లాడుతున్న ఆర్ఐఓ ప్రభాకర్‌రెడ్డి

చిత్తూరు కలెక్టరేట్ : నిబంధనల మేరకే ఇంటర్మీడియట్ పరీక్ష ఫీజులు వసూలు చేయాలని, అధికంగా వసూలు చేస్తే రూ.2లక్షల జరిమానా తప్పదని, కళాశాలను సైతం సీజ్ చేస్తామని ఉమ్మడి జిల్లా ఆర్ఐఓ ప్రభాకర్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం చిత్తూరులోని పీసీఆర్ జూనియర్ కళాశాలలో ప్రభుత్వ, ప్రైవేట్ కాలేజీ యాజమాన్యాల ప్రిన్సిపల్స్‌తో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం జీఈఆర్ నమోదుపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందన్నారు. 2022–23 విద్యాసంవత్సరంలో ఇంటర్ ఫెయిల్ అయిన విద్యార్థులు ఈ ఏడాది పరీక్షకు హాజరయ్యేలా చర్యలు చేపట్టాలని సూచించారు. రీ అడ్మిషన్ అయ్యే విద్యార్థులకుఅమ్మఒడి, రెగ్యులర్ విద్యార్థులతో సమానంగా ఏ,బీ, సీ గ్రేడ్‌ల సర్టిఫికెట్ అందిస్తున్నట్లు వెల్లడించారు. చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల నుంచి ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ఫెయిల్ అయిన వారు 16,793 మంది ఉన్నట్లు వివరించారు. వీరి పరీక్ష ఫీజును ఈ నెల 30వ తేదీ లోపు తప్పనిసరిగా చెల్లించేలా ప్రిన్సిపల్స్ చర్యలు చేపట్టాలన్నారు. ఫీజులు చెల్లించకపోతే ఆయా కళాశాలలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో డీవైఈఓ సయ్యద్‌మౌలా, పీసీఆర్ కళాశాల ప్రిన్సిపల్ మజీద్ పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య


విజయలక్ష్మి (ఫైల్)

సోమల: మండల కేంద్రం సమీపంలో కాలిన మృతదేహాన్ని మంగళవారం ఉదయం గ్రామస్తులు గమనించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఇన్‌చార్జి సీఐ రాఘవరెడ్డి హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. మృతురాలు సోమలకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు కోటేశ్వరయ్య భార్య విజయలక్ష్మి(53)గా గుర్తించారు. ఆమె కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధ పడుతోందని, ఈ కారణంగానే ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నట్లు ప్రాథమిక విచారణలో తేలించదని సీఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పుంగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు వెల్లడించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌చార్జి ఎస్ఐ మారుతి తెలిపారు.

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నవరత్నాలు– పేదలందరికీ ఇళ్ల పథకం సత్ఫలితాలందిస్తోంది. వేలాది మంది నిరుపేదలకు గూడు కల్పిస్తోంది. సొంత ఆవాసాల్లో చేరాలనే చిరకాల స్వప్నాలను నెరవేరుస్తోంది. అద్దె కష్టాల నుంచి విముక్తి కల్పిస్తోంది. సర్కారు చిత్తశుద్ధిపై సర్వత్రా హర్షాతిరేకం వ్యక్తమవుతోంది. మహోన్నత పథకంపై ప్రజానీకం ప్రశంసలు కురిపిస్తోంది. ఈ క్రమంలో లబ్ధిదారుల సంతోషం వారి మాటల్లోనే.. – చిత్తూరు కలెక్టరేట్

ప్రభుత్వం నిర్మించిన పేదలందరికీ పక్కా ఇళ్లు


జనవాక్కు

గూడు కుదిరె!

నిశ్చింతగా ఉన్నా



నా భర్త నన్ను ఒంటరిని చేసి వెళ్లిపోయాడు. నాకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు. మిల్లులో కూలీ పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నా. పదేళ్లకు పైగా బాడుగ ఇంట్లోనే ఉన్నా. అద్దె చెల్లించేందుకు నానా అవస్థలు పడేదాన్ని. నా స్థితికి సొంత ఇల్లు అనే కల కనడానికి కూడా భయమేసేది. అలాంటిది ఇప్పుడు ఓ ఇంటికి యజమానిని అయ్యా. ఇదంతా ముఖ్యమంత్రి జగనన్న చలవే. నాకు రూ.1.5 లక్షల విలువైన స్థలం ఇచ్చారు. ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షలు అందించారు. ప్రస్తుతం సొంతిట్లో నిశ్చింతగా ఉన్నా.

– ఈశ్వరి, ముడిపల్లె, నగరి మండలం.

రుణం తీర్చుకోలేం



ఏళ్ల తరబడి అద్దె ఇంట్లోనే ఉన్నాం. ఇల్లు నిర్మించుకోవాలంటే స్థలం లేదు. స్థలం కొనేందుకు స్తోమత చాలదు. జీవితాంతం అద్దె ఇంట్లోనే ఉండిపోవాలమో అనే దిగులు ఉండేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ముందు స్థలం మంజూరు చేశారు. తర్వాత ఇల్లు నిర్మాణానికి సకాలంలో నగదు అందించారు. కేవలం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వల్లే మేము సొంతింటిలోకి రాగలిగాం. ఆయన రుణం ఎన్నటికీ తీర్చుకోలేం. ఎప్పటికీ జగనన్న వెంటే ఉంటాం.

– శ్రీనివాసులు రాజు, లబ్ధిదారు, కార్వేటినగరం

కల నెరవేరింది



అద్దె ఇంటి బాధలు తప్పాయి. సొంతిటి కల నెరవేరింది. నేను, నాభర్త రాతి పనిచేస్తు జీవనం సాగిస్తున్నాం. మాకు ముగ్గురు పిల్లలు. 7 ఏళ్లుగా కాలనీ ఇంటి కోసం తిరిగి తిరిగి అలసిపోయాం. మోడల్ కాలనీ వద్ద నిర్మిస్తున్న జగనన్న కాలనీలో మాకు స్థలం ఇచ్చారు. ఇల్లు సైతం మంజూరు చేశారు. ఇప్పుడు సొంత ఇంటి నిర్మాణం పూర్తి చేసుకున్నాం. ఈ ఇల్లు మాది అని సగర్వంగా చెప్పుకుంటూ నివసిస్తున్నాం. ఇదంతా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చలువే. ఆయన రుణం ఎన్ని జన్మలెత్తినా తీర్చుకోలేం.

– సల్మా, లబ్ధిదారు, కుప్పం మండలం

ఇల్లు కట్టించారు



మాది నిరుపేద కుటుంబం. నా భర్త ఆటో డ్రైవర్ గా పనిచేస్తాడు. ఆ వచ్చే డబ్బుతో కుటుంబం గడవాల్సిన పరిస్థితి . ఇంక మేం సొంత ఇల్లు ఎప్పుడు కట్టుకునేది. 25 ఏళ్లుగా బాడుగ ఇంట్లోనే ఉన్నాం. టీడీపీ ప్రభుత్వంలో ఎన్నిసార్లు దరఖాస్తు చేసుకున్నా పక్కా ఇల్లు మంజూరు చేయలేదు. పలుమార్లు కార్యాలయాల చుట్టూ తిరిగినా ప్రయోజనం లేకుండా పోయింది. ఎవరూ మా గురించి పట్టించుకోలేదు. జగనన్న ప్రభుత్వం వచ్చిన తర్వాత మాకు స్థలం ఇచ్చారు. ఇప్పుడు ఇల్లు కట్టించారు. ఆయన మేలు మరువలేం.

– గులాబ్జాన్, లబ్ధిదారు, గంగవరం మండలం

అట్రాసిటీ కేసుపై విచారణ


విచారణ చేస్తున్న డీఎస్పీ శ్రీనివాసమూర్తి

గుడిపాల: టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్రమణ్యం నాయుడుపై ఈనెల 9వ తేదీన గుడిపాల పోలీస్‌స్టేషన్‌లో నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుపై డీఎస్పీ శ్రీనివాసమూర్తి మంగళవారం విచారణ చేపట్టారు. వెంగమాంబపురం దళితవాడకు చెందిన జస్టిన్ అనే వ్యక్తి కమ్మతిమ్మాపల్లె క్రాస్‌లోని పెట్రోల్‌బంక్‌లో పంప్ ఆపరేటర్‌గా పనిచేసేవాడు. ఈక్రమంలో టీడీపీ నేత తన వాహనానికి డీజిల్ పట్టాలని హారన్ కొడుతూ హల్‌చల్ చేశాడు. దీనిపై ప్రశ్నించిన జస్టిన్‌ను కులం పేరుతో దూషించాడు. ఈకేసుపై డీఎస్పీ శ్రీనివాసమూర్తి, సీఐ శివశంకర్‌రెడ్డి పెట్రోల్‌బంక్ వద్దకు వెళ్లి జస్టిన్‌తోపాటు చుట్టుపక్కల ఉన్న వారిని విచారించారు.

అధికంగా పరీక్ష ఫీజు వసూలుపై విచారణ

చిత్తూరు కలెక్టరేట్ : వి.కోటలోని వాణి పాఠశాలలో అధికంగా పరీక్ష ఫీజులు వసూలు చేస్తున్నట్లు బహుజనసేన సంఘం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసులు ఆరోపించారు. మంగళవారం ఈ మేరకు డీఈఓ విజయేంద్రరావుకు ఫిర్యాదు చేశారు. ఒక్కో విద్యార్థి నుంచి పరీక్ష ఫీజు కింద రూ.వెయ్యి వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. దీనిపై స్పందించిన డీఈఓ వెంటనే విచారణకు ఆదేశించారు.

గోల్డ్ మెడల్ విజేతకు అభినందన


జగదీశ్వర్‌ను అభినందిస్తున్న అధ్యాపకులు

పుత్తూరు: తిరుపతి ఎస్వీయులో నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయికరాటే పోటీలలో పుత్తూరు ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో థర్డ్ బీఎస్సీ విద్యార్థి డి.జగదీశ్వర్ గోల్డ్ మెడల్ సాధించాడు. ఈ మేరకు మంగళవారం కళాశాలలో జగదీశ్వర్‌ను అధ్యాపకుల అభినందించారు. కార్యక్రమంలో ప్రి న్సిపల్ శ్రీనివాసులురెడ్డి, అధ్యాపకులు సూర్యబాబు, కోటేశ్వరయ్య, సుజన పాల్గొన్నారు.

త్వరితగతిన ఓటరు క్లెయిమ్స్ పరిష్కారం


అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ షణ్మోహన్

నగరి : ఓటర్ల జాబితాకు సంబంధించి పెండింగ్ క్లెయిమ్స్ త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. మంగళవారం నగరి, నింద్ర, ఎస్ఆర్ పురం, వెదురుకుప్పం, కార్వేటినగరం, పెనుమూరు తహసీల్దార్ కార్యాలయాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఫారం 6,7,8 క్లెయిమ్స్‌ను నిర్ణీత గడువు లోపు పరిష్కరించాలన్నారు. ఈనెల 23వ తేదీ లోపు పెండెన్సీని పూర్తిస్థాయిలో తగ్గించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీఓ సుజన పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో పరిశీలించాలి

పెద్దపంజాణి/గంగవరం : ఓటరు క్లెయిమ్స్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని జేసీ శ్రీనివాసులు ఆదేశించారు. మంగళవారం పెద్దపంజాణి, గంగవరం, శాంతిపురం, కుప్పం మండలాల తహసీల్దార్ కార్యాలయాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. జేసీ మాట్లాడుతూ నిబంధన మేరకు ఓటరు క్లెయిమ్స్‌ను పక్కాగా పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీఓలు మనోజ్ కుమార్ రెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

అభివృద్ధిని ఓర్వలేకే అసత్య ప్రచారం


మాట్లాడుతున్న ఆలయ కమిటీ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో చేపట్టిన అభివృద్ధి పనులను ఓర్వలేకే కొందరు అసత్య ప్రచారానికి తెరతీశారని ఆలయ కమిటీ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశు ఆరోపించారు. మంగళవారం ఆలయ సమావేశమందిరంలో వారు విలేకర్లతో మాట్లాడారు. ముందుగా చైర్మన్, ఈఓ మాట్లాడుతూ భక్తుల కోసం అనేక సౌకర్యాలు కల్పించామని, సులువుగా స్వామి వారి దర్శనం చేసుకునేలా చర్యలు చేపట్టామన్నారు. అయితే ఆలయ ప్రతిష్టను దెబ్బదీసేలా కొందరు సామాజిక మాధ్యమాల్లో తప్పుడు వార్తలు వైరల్ చేస్తున్నారని మండిపడ్డారు. ఎక్కడైనా తప్పు జరిగితే నేరుగా మా దృష్టికి తీసుకువస్తే వెంటనే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎమ్మెల్యే ఎంఎస్ బాబు సహకారంతో ఎన్ఆర్ఐల విరాళాలతో ఆలయ పునర్నిర్మాణం పూర్తి చేశామన్నారు. భక్తుల సేవే పరమావధిగా కృషి చేస్తుంటే సోషల్ మీడియాతోపాటు, పలు పత్రికల్లో అసత్య కథనాలు వండి వారుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆలయ విశిష్టతను దేశవ్యాప్తంగా చేసేందుకు వారణాసిలో స్వామి వారి కల్యాణం జరిపించామని, అయితే ఇందులో నిధుల దుర్వినియోగం జరిగినట్లు ఆరోపించడం బాధాకరమన్నారు. అన్నింటికీ లెక్కలు ఉన్నాయని ఎవరైనా పరిశీలించుకోవచ్చని స్పష్టం చేశారు. అలాగే ఆలయంలో అన్యమత ప్రచారం చేస్తున్నారని అర్థం పర్థం లేకుండా ఆరోపణలు గుప్పిస్తున్నారని మండిపడ్డారు. ఓ మహిళ తమ ఇంట్లో పగిలిన ఫొటోను స్థానిక వరదరాజస్వామి ఆలయంలో పెట్టిందని, దీనిపై ఆమెతోపాటు అక్కడ విధుల్లో ఉన్న హోంగార్డుపై చర్యలు తీసుకోనున్నట్లు వెల్లడించారు. ఆలయ అర్చకుడు శేఖర్‌గురుకుల్, వేద పండితుడు సుబ్బారావు మాట్లాడుతూ ఎవరి ఇంట్లో అయినా దేవతల ఫొటో పగిలిపోతే వేపచెట్లు, రచ్చబండ వద్ద పెట్టుకోవాలని, ఆలయాల్లో పెట్టడం నిషేధమని స్పష్టం చేశారు.

రైల్లో నుంచి పడి వ్యక్తి మృతి

కుప్పంరూరల్: బెంగళూరు –చెన్నై మార్గంలో మల్లానూరు రైల్వే స్టేషన్ వద్ద ఓ వ్యక్తి (60) రైలు నుంచి జారిపడి దుర్మరణం పాలయ్యాడు. ఈ మేరకు కుప్పం రైల్వే హెడ్ కానిస్టేబుల్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

టెన్నికాయిట్ జిల్లా జట్టు ఎంపిక


జట్టుకు ఎంపికైన విద్యార్థులు

గంగవరం : స్థానిక ఉన్నత పాఠశాలలో మంగళవారం టెన్నికాయిట్ జిల్లా జట్టు ఎంపిక చేశారు. అసోసియేషన్ కార్యదర్శి చిన్నప్ప ఆధ్వర్యంలో ప్రతిభ చూపిన మొత్తం 10 మంది విద్యార్థులను జట్టుకు ఎంపిక చేసినట్టు ప్రధానోపాధ్యాయుడు పరశురాం తెలిపారు.

అండర్–14 ఖోఖో రాష్ట్ర జట్ల ఎంపిక

బంగారుపాళెం: స్కూల్ గేమ్స్ అండర్–14 రాష్ట్ర ఖోఖో బాలబాలికల జట్ల ఎంపికను మంగళవారం బంగారుపాళెంలో నిర్వహించారు. బాలికల జట్టు : దివ్య, కీర్తన, అమృత(చిత్తూరు), సరస్వతి, భావన(శ్రీకాకుళం), గురవమ్మ(ప్రకాశం), తులసి, లాస్య (విశాఖపట్నం), మహాలక్ష్మి(గుంటూరు), సుప్రజ (కృష్ణాజిల్లా), కృష్ణవేణి(ఈస్ట్‌గోదావరి), వినూత్న(నెల్లూరు), బాలుర జట్టు : జశ్వంత్, ప్రవీణ్‌కుమార్, బద్రీనాథ్(చిత్తూరు), నవీన్, ఎల్లప్ప (కర్నూల్), వెంకటమనోజ్(ప్రకాశం), జానకీరాం(విశాఖపట్నం), రణపాల్ (గుంటూరు), భాస్కర్(కృష్ణా), యుగంధర(విజయనగరం), ఉజ్వల్(నెల్లూరు), యోగేష్ (చిత్తూరు) ఎంపికైనట్లు కోచ్ తెలిపారు.

జిల్లాకు చేరిన ట్రాన్స్‌ఫార్మర్లు

చిత్తూరు కార్పొరేషన్: వ్యవసాయానికి వినియోగించే 25 కేవీ సామర్థ్యం గల ట్రాన్స్‌ఫార్మర్లు 60 వచ్చినట్లు ఎస్ఈ కృష్ణారెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ సంబంధిత ఏఈలు వర్క్ ఆర్డర్లు పెట్టి మెటీరియల్ డ్రా చేసుకోవాలని సూచించారు

శ్మశానవాటిక అభివృద్ధికి రూ.10లక్షల విరాళం


విరాళం అందిస్తున్న విజయానందరెడ్డి

చిత్తూరు రూరల్: నగరంలోని కైలాసపురం శ్మశానవాటిక అభివృద్ధి పనులకు ఆర్టీసీ వైస్‌చైర్మన్ ఎంసీ విజయానందరెడ్డి రూ.10 లక్షల విరాళం అందించారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో ఆర్యవైశ్యులకు నగదును అందజేశారు. ఈ సందర్భంగా దాతకు ఆర్యవైశ్య సంఘ నాయకులు ద్వారకనాథ్, శ్రీనివాసమూర్తి కృతజ్ఞతలు తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

కుప్పంరూరల్: మండలంలోని కృష్ణాపురం గ్రామంలో ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మంగళవారం వెలుగు చూసింది. గ్రామానికి చెందిన గోవిందరాజులుకు గరిగచీనేపల్లికి చెందిన ఇందిర (22)తో ఐదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు ఆడపిల్లలు కలిగారు. ఈ క్రమంలో ఇందిర సోమవారం తన నివాసంలో ఉరేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు తహసీల్దారు పార్వతమ్మ, సీఐ శ్రీధర్ ఘటనాస్థలాన్ని పరిశీలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నారు.

గుండెపోటుతో తమిళనాడు వాసి మృతి

కుప్పంరూరల్: తమిళనాడులోని సేలం నగరానికి చెందిన మారియప్పన్ (60) కుప్పంలో బెల్దారు పని చేసుకుని జీవనం సాగించేవాడు. మంగళవారం మధ్యాహ్నం కుప్పం ఎంపీడీవో కార్యాలయం ముందుకు రాగానే కుప్పకూలి మారియప్పన్ దుర్మరణం పాలయ్యాడు. గుండెపోటు వచ్చి ఉండవచ్చని స్థానికులు భావిస్తున్నారు. జెడ్పీటీసీ సభ్యుడు ఏడీఎస్ శరవణ సొంత ఖర్చులతో మృతదేహాన్ని తమిళనాడుకు పంపించారు.

యువతి అదృశ్యం

పుత్తూరు: పట్టణంలోని ఎన్జీఓ కాలనీకి చెందిన జ్యోతి(28) అనే యువతి అదృశ్యమైనట్లు పోలీసులకు మంగళవారం ఫిర్యాదు అందింది. మున్సిపల్ వైస్ చైర్మన్ డి.జయప్రకాష్ మాట్లాడుతూ తమ 14వ వార్డులోని బలరామ్‌యాదవ్ నాలుగో కుమార్తె జ్యోతి ఒంటరిగా నివసించేదని, ఐదు రోజులుగా కనిపించడం లేదని స్థానికులు తన దృష్టికి తీసుకొచ్చినట్లు తెలిపారు. బలరామ్‌యాదవ్ మృతి చెందడంతో అక్కాచెల్లెళ్ల నడుమ ఆస్తి వివాదాలు ఉన్నట్లు వెల్లడించారు. ఈ మేరకు వారిని విచారిస్తే అసలు విషయాలు బయటపడతాయని స్పష్టం చేశారు.

గుర్తింపునకు పిరమలై కల్లర్ కులస్తుల వినతి


ఎమ్మెల్సీ భరత్‌కు వినతిపత్రం అందిస్తున్న పిరమలై కల్లర్ కులస్తులు

కుప్పంరూరల్ : రాష్ట్రంలో సుమారు 75 ఏళ్లుగా నివసిస్తున్నా ఎలాంటి గుర్తింపు లేదని, ఇప్పటికైనా తమను బీసీలుగా గుర్తించాలని పిరమలై కల్లర్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈశ్వర్‌దేవర్, జిల్లా అధ్యక్షుడు సౌందర్‌రాజన్ విన్నవించారు. మంగళవారం ఈ మేరకు ఎమ్మెల్సీ భరత్‌కు వినతి పత్రం అందించారు. తమిళనాడు నుంచి ఆంధ్రప్రదేశ్‌కు వచ్చి మిఠాయిలు తయారు చేసి చిల్లర దుకాణాలకు వేస్తూ జీవనం సాగిస్తున్నామని వారు పేర్కొన్నారు. పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలన్నా, ప్రభుత్వ సంక్షేమ పథకాల కోసం దరఖాస్తు చేసుకోవాలన్నా గుర్తింపు లేక ఇబ్బందులు పడుతున్నామని వెల్లడించారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్సీ భరత్ ఈ విషయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

జర్నలిస్టుల ఇంటి స్థలాలకు దరఖాస్తులు

చిత్తూరు కలెక్టరేట్ : అర్హులైన జర్నలిస్టులకు ఇంటి స్థలాలు మంజూరు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. మంగళవారం ఈ మేరకు ఐ అండ్ పీఆర్ కమిషనర్ విజయ్‌కుమార్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. అర్హులైన వారు ఈ నెల 23వ తేదీ నుంచి www.ipr.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు.2024 జనవరి 6వ తేదీ దరఖాస్తులకు ఆఖరు తేదీగా నిర్ణయించారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయిన తర్వాత ప్రాథమికంగా అక్రిడిటేషన్ వివరాలు, అనుభవం మొదలైనవి ధ్రువీకరించనున్నట్లు ఉత్తర్వుల్లో వివరించారు. గుర్తింపు పొందిన జర్నలిస్టులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకుని నిర్ణీత గడువులోపు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

ఖోఖో పోటీల్లో సత్తా చాటిన జిల్లా జట్లు


ట్రోఫీ అందిస్తున్న కుమార్‌రాజా, డీఈఓ విజయేంద్రరావు


బాలుర జట్టుకు బహుమతి ప్రదానం

బంగారుపాళెం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించిన అంతర్ జిల్లాల ఖోఖో అండర్–14 బాల బాలికల పోటీల్లో జిల్లా జట్లు విజయం సాధించాయి. బాలికల విభాగంలో చిత్తూరు జిల్లా జట్టు ప్రథమ స్థానం, ద్వితీయ స్థానంలో శ్రీకాకుళం జిల్లా, మూడో స్థానంలో ప్రకాశం జిల్లా జట్లు నిలిచాయి. బాలుర విభాగంలో చిత్తూరు జిల్లా జట్టు ప్రథమ, రెండో స్థానంలో కర్నూలు, మూడో స్థానంలో ప్రకాశం జట్టు నిలిచినట్లు నిర్వాహకులు తెలిపారు. విజేతలకు పాలఏకరి కార్పొరేషన్ చైర్మన్ కుమార్‌రాజా, జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్, డీఈఓ విజయేంద్రరావు, సర్పంచ్ ఉమాదేవి, మాజీ సర్పంచ్ కృష్ణమూర్తి బహుమతులు ప్రదానం చేశారు.